# చిగురుకోసం దోసెడు నీళ్ళు

మనసొంపుగా

'ఏం చేయాలి? ఎలా చేయాలి? ఏం చేయాలి?, చాలాసేపు ఆలోచిస్తూ వుండి పోయాను. ఎంత ఆలోచించినా మార్గం కన్పించడంలేదు. టెన్షన్‌తో బుర్ర పని చేయలేదు. టైం వేస్టయిపోతోంది.అమ్మో! వాళ్ళొచ్చేస్తారేమో!. ఈలోపే ఏదైనా ఉపాయం ఆలోచించాలి! ఎలాగైనా సరే! ఈ గండం నుంచి గట్టెక్కించాలి!!!.

కాని ఎలా? మేడమీద పచార్లు చేస్తూ కొంత సేపు ఆలోచించాను. కాని ఏమీ తట్టడంలేదు. చివరికి పైన వున్న వాటర్ ట్యాంక్ ట్యాప్ తిప్పి చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కున్నాను. టెన్షన్ తగ్గి రిలీఫ్ ఇచ్చింది. అప్పుడు ఆ వాటర్ ట్యాంక్ ప్రక్కనే గంటకు పైగా కూర్చుని కూల్‌గా ఆలోచించి ఒక వ్యూహాన్ని రూపొందించుకున్నాను.

మేడ దిగివచ్చి హాల్లో టి.వి. చూస్తున్న అమ్మ దగ్గరికి మెల్లగా చేరాను.

"ఏంటే? ఇందాకట్నుంచి ఎక్కడికి పోయావు?" అడిగింది అమ్మ.

"పైన కూర్చున్నాలే" అన్నాను అమ్మ ఒడిలో తల పెట్టుకుని పడుకుంటూ.

"అంత చీకట్లో అక్కడ నీకేంపని? దయ్యమేదైనా పట్టిందా? అంటూ నెత్తిమీద మొట్టికాయ వేసింది అమ్మ.

"అబ్బే!దయ్యమేం కాదు. ఊరకనే.. మనసేం బాగోలే" అన్నాను నెమ్మదిగా.

"ఏం పాపం! మీ ఫ్రెండ్స్‌తో గొడవ పడ్డావా? అవెప్పుడూ వుండేవేగా!"

నేనేం మాట్లాడలేదు. అమ్మ మూడ్ బాగానే వున్నట్టుంది. అందుకే డైరెక్టుగా సబ్జెక్టులోకి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాను.

"అమ్మా! మరి.. నాంచారి ఊరెళ్ళిపోవలసిందేనా?" అన్నాను.

"ఊరెళ్ళక ఇక్కడేం చేస్తుంది? గుడ్డి గుర్రానికి పళ్ళు తోముతుందా?"

"అది కాదమ్మా! తనకి ఆ ఊరెళ్ళడం అస్సలిష్టం లేదు."

"దాని ఇష్టాఇష్టాలతో పనేముంది? ఊరు పంపించేయాలని నాన్నగారు నిర్ణయించారు.. అంతే"

"పాపం! నాంచారి సాయంత్రం నుంచి ఏడుస్తోనేవుందమ్మా! వాళ్ల మామయ్య మంచివాడు కాదట! గవర్నమెంట్ ఇచ్చే డబ్బులకోసం నాంచారిని తీసుకెళ్తున్నాడంట! డబ్బులు చేతికందాక నాంచారిని తన్ని తరిమేస్తారు. అందుకే బాగా భయపడి పోతోంది" అన్నాను.



"దానికి మనమేంచేస్తాం? నాంచారి మన చుట్టమేంకాదుగా! మన పనిమనిషి మనవరాలు. వాళ్ళు, వాళ్ళ బంధువులు, రక్త సంబంధీకులు. మనమేదైనా అంటే గొడవ చేస్తారు. అందుకే నాన్నగారు పంపించేయాలన్నారు" అంది అమ్మ.

"అమ్మా! అమ్మా! ప్లీజ్! ఒక్క క్షణం ఆలోచించు. నాంచారిని నువ్వు అభిమానించలేదూ? మంచిపిల్ల, తెలివిగలది అని ఎన్ని సార్లు మెచ్చుకోలేదూ! ఆటువంటి నాంచారి విందు జీవితం బండలైపోతుంటే నీకేమీ అనిపించడంలేదా? నాంచారిని వాళ్ళ మామయ్యకి అప్పగించడం అంటే దాని జీవితాన్ని మనమే చేజేతులా నాశనం చేసినట్టే కదమ్మా! అన్నాను అమ్మ కళ్ళలోకి చూస్తూ. ఆ మాటలంటున్నప్పుడు అప్రయత్నంగానే నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

నాకళ్ళలో నీళ్ళు చూసిన అమ్మ చలించింది. "పిచ్చిపిల్ల! నాంచారి. వెళ్ళిపోతోందంటే అంత దిగులుపడిపోతే ఎలా? కొన్ని సందర్భాలలో మనమేం చేయలేం! అంతే! బాధపడి ఊరుకోవలసిందే. నాకు మాత్రం బాధ లేదనుకున్నావా? కాని నాన్నగారు ఎంతో ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చారు" అంది అమ్మ నన్ను తన గుండెలకు హత్తుకుంటూ.

"అలా కాదమ్మా. నాంచారిని మనమే ఆదుకోవాలి. నువ్వు తలచుకుంటే అదెంతో సులభం. ఒక్కసారి ఆలోచించు" అన్నాను.

"నేనేం చేసేదే? ఏదో అంతా నాచేతుల్లోనే వుందన్నట్టు మాట్లాడతావేం?" అంది అమ్మ.

"ఔనమ్మా! నీ చేతుల్లోనే వుంది. నువ్వు చేయగలవే. తప్పకుండా చేయగలవే" అన్నాను. అమ్మ చేత ఎలాగైనా 'ఎస్' అనిపించాలని తపన పడిపోతున్నాను.

"ఎలాగే? నేనేం చేయాలి?"

"అలా అడిగావు బాగుంది. నేనొక చిన్న ఉపాయం చెబుతాను. నీవుచాలా చేయాల్సింది సింపుల్. ఇప్పుడు నాంచారిని తీసుకెళ్ళిపోవడానికి వాళ్ళ మామయ్య, అత్తయ్య వస్తారు కదా! వాళ్ళకి నాంచారిని అప్పగించొద్దు. రేపు రండి, రేపు రండి అంటూ రెండు మూడు రోజులు వాయిదా వేద్దాం" అన్నాను.

"అలా చేస్తే ప్రయోజనం ఏమిటి?" అనుమానంగా అడిగింది అమ్మ.

"వుందమ్మా. నేను చెబుతున్నాగా. నువ్వు మాత్రం నాన్న గారికి ఎలాగైనా నచ్చజెప్పి నాంచారి ప్రయాణాన్ని వాయిదా వేయించు. నాన్నగారిని ఒప్పించే పూచీ నీదే " అన్నాను అమ్మ చేతులు గట్టిగా పట్టుకొని.

"ఏమోనమ్మా! నాకంతా అయోమయంగా వుంది. నాన్నగారేమంటారో!"

"ఏం అనరు. ఏమీ అనకుండా చూసే బాధ్యత కూడా నీదే!. త్వరగా నాన్నగారి దగ్గరికెళ్ళు. మళ్ళీ వాళ్ళొచ్చేస్తారు" అని అమ్మని తొందర

పెట్టి ముందు ఆఫీసు గదిలో పని చేసుకుంటున్న నాన్నగారి దగ్గరికి అమ్మని పంపేశాను.

"హమ్మయ్య!" అని ఊపిరి తీసుకున్నాను. అమ్మ తలచుకుంటే సాధించగలదు. ఆ నమ్మకం నాకుంది. నాంచారిని ఆదుకోగలదన్న విశ్వాసం కలగడంతో ఇందాకటి టెన్షన్ తగ్గిపోయింది.

నాంచారి!

మా పనిమనిషి కౌసల్య మనవరాలు. కౌసల్య చాలా కాలంగా మా ఇంట్లో పని చేస్తోంది. మా కుటుంబ సభ్యురాలిగా కలిసిపోయింది. వంటపని, ఇంటిపని చేస్తున్నా, అమ్మగాని, నాన్నగారు కాని పనిమనిషిలా చూసేవారు కాదు. ఎంతో గౌరవించే వారు. ఒకోసారి వాళ్ళిద్దరినీ కౌసల్య దబాయించేసేది. కౌసల్య కోసం నాన్నగారు ప్రత్యేకంగా రెండు గదులు కట్టించి ఇచ్చారు. కాని కౌసల్య ఎప్పుడూ మా ఇంట్లోనే వుండేది.

గత ఏడాది వచ్చిన తుపానులో కౌసల్య కూతురు, అల్లుడు చనిపోయారు. ఊరంతా కొట్టుకుపోయింది. వాళ్ళ అమ్మాయి నాంచారి అప్పుడు అమ్మమ్మని చూడడానికి ఇక్కడికి రావడం వల్ల బ్రతికిపోయింది. అప్పటినుంచి నాంచారి మాఇంట్లోనే వుండిపోయింది. నాంచారి నాకంటే మూడేళ్ళు చిన్నది. కాని నేను కాలేజిలో జాయినయినా నాంచారి మాత్రం టెన్త్‌తోనే చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసింది. చదువంటే నాంచారికి చాలా ఇష్టం. నాతో పాటు కూర్చుని నా పుస్తకాలను చదవడానికి ప్రయత్నించేది. అమ్మకు తోడుగా వుండేది.

కాని ఒకరోజు కౌసల్యకు అకస్మాత్తుగా జబ్బు చేసింది. నాన్నగారు కౌసల్యను ఆస్పత్రిలో చేర్చారు. కాని ఎంత ప్రయత్నించినా కౌసల్య ప్రాణాలను డాక్టర్లు కాపాడలేకపోయారు.నాన్నగారు కౌసల్య చుట్టాలకు టెలిగ్రాం పంపారు. మనిషిని కూడా పంపారు. కాని ఎవరూ రాలేదు. చివరికి నాన్నగారే ఎవరికో డబ్బిచ్చి అంత్యక్రియలు జరిపించారు. పాపం నాంచారిని కంట్రోల్ చేయడం ఎవరితరం కాలేదు. రోజుల తరబడి నాంచారి కళ్ళ వెంట కన్నీళ్ళు ధారాపాతంగా కారుతూనే వున్నాయి. అమ్మ, నేను నాంచారిని ఎంతగానో ఓదార్చాం. ఇప్పుడిప్పుడే నాంచారి తేరుకుంటోంది. అమ్మమ్మ మిగిల్చిన విషాద ఛాయలు ఇంకా పూర్తిగా తొలగిపోకముందే నాంచారి మీద పిడుగు పడ్డట్టు నాంచారి మామయ్య, అత్తయ్య వచ్చిపడ్డారు.

దిక్కులేనిదయిన నాంచారిని తాము తీసుకెళ్తామని, చదువు చెప్పిస్తామని, పెళ్ళి చేస్తామని, చనిపోయిన వాళ్ళందరినీ నాంచారిలో చూసుకుంటామని వాళ్ళిద్దరూ నాన్నగారికి, అమ్మకు ఎన్నెన్నో తీయని కబుర్లు చెప్పారు. గవర్నమెంట్ వాళ్ళు ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇంకా ఏవేవో సహాయాలు అందిస్తున్నారని, వాటితో నాంచారి జీవితం బాగుపడుతుందని, వాటన్నింటినీ దగ్గరుండి చూసుకుంటామని వాళ్ళు చెప్పారు.

నాంచారిని వాళ్ళతో పంపించే విషయంపై అమ్మా, నాన్నగారు ఎంతోసేపు తర్జన భర్జన పడ్డారు. నాంచారి అత్తయ్య, మామయ్యల నిజాయితీపై అనుమానపడ్డారు. కాని చివరికి నాంచారిని వాళ్ళతోనే పంపడానికి నిశ్చయించారు.' లేనిపోని బాధ్యతల్ని నెత్తికెత్తుకోవడం ఎందుకు?' ' వీలయినంతవరకు వదిలించుకోవడమే బెటర్.' లేకపోతే భవిష్యత్తులో అనవసరంగా తల నొప్పి రావొచ్చు', అని నాన్నగారు బిజినెస్‌మేన్ లా ఆలోచించి నాంచారిని సాగనంపడానికే నిర్ణయించారు. వాళ్ళిద్దర్నీ రాత్రికి రమ్మని చెప్పి పంపేశారు. అప్పటి నుంచి నేను ఎంతో బాధని, టెన్షన్ అనుభవించి చివరికి అమ్మ ద్వారా ఈ కార్యక్రమానికి బ్రేక్ వేయడానికి ప్రయత్నించాను.



"నీమాటే నెగ్గిందిలేవే! నాన్నగారు కూడా రెండు మూడు రోజుల తర్వాత చూద్దాంలే అనేశారు" అని అమ్మ అనడంతో ఈ లోకంలోకి వచ్చిన నేను ఆనందంతో అమాంతం అమ్మను ఎగిరి వాటేసుకున్నాను.

యథా ప్రకారం నాంచారి అత్తయ్య, మామయ్య వచ్చారు.'చూద్దాం లేవయ్యా! రెండు రోజులాగిరా' అనేసి నాన్నగారు వాళ్ళని పంపేశారు. తమ పథకం కాస్తా తల్లక్రిందులవటంతో వాళ్ళిద్దరూ నిశ్చేష్టులయ్యారు. నాంచారి మామయ్య నాన్నగారితో వాదనకు దిగబోతుంటే అతని పెళ్ళాం అతన్ని బలవంతంగా లాక్కెళ్ళిపోయింది.

ఊహించని ఈ పరిణామానికి నాంచారి ఎంతో ఆనందపడింది. అడ్డుపుల్ల వేసిన నన్ను ఆరాధనగా చూసింది.

అయితే ఆ మర్నాడు ఉదయాన్నే నాంచారి అత్తయ్య వచ్చింది. తమకి వూళ్ళో చాలా చాలా పనులు వున్నాయని, ఇక్కడ ఎక్కువ రోజులు వుండిపోతే ఇబ్బందని, మళ్ళీ రావాలంటే కుదరదని, ఆలస్యం అయితే ప్రభుత్వం నుంచి సాయం కూడా అందకుండా పోతుందని...ఇలా ఇంకా ఎన్నెన్నో సాకులను అమ్మకి చెప్పి నాంచారిని తీసుకెళ్ళిపోవడానికి విశ్వప్రయత్నం చేసింది. అయితే ఆమె ఆతురత గమనించిన అమ్మలో పంతం పెరిగింది. ఆమె చెప్పినదంతా ఓపిగ్గా విని చివరికి నాన్నగారు చెప్పిన మాటల్నే రిపీట్ చేసింది. చేసేది లేక ఆమె కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయింది.

ఆమె మాటలకు అమ్మ మనసు మార్చుకుంటుందేమోనని నేను కొద్దిసేపు భయపడ్డాను. చివరికి నాకు పూర్తిగా ధైర్యం వచ్చేసింది. నా పరిస్థితే ఇలా వుంటే నాంచారి మానసిక పరిస్థితి ఎలా వుంటుందో ఊహించడానికే భయమేసింది.

ఆ సాయంత్రం అమ్మ, నాన్నగారు చాలాసేపు నాంచారి విషయం చర్చించుకున్నారు. చివరికి నాన్నగారు నాంచారిని బస్సెక్కించి మా బాబాయి వాళ్ళ ఊరు పంపేశారు. బాబాయికి ఫోన్ చేసి అన్ని విషయాలు చెప్పి బస్టాండ్‌లో నాంచారిని రిసీవ్ చేసుకోవాలని, అక్కడే ఏదైనా రెసిడెన్షియల్ కాలేజీలో నాంచారిని చేర్పవలసినదిగా చెప్పారు.

ఇదంతా జరిగిన అరగంటకు నాంచారి మామయ్య వచ్చాడు. రావడంతోనే నాన్నగారితో గొడవ పడ్డాడు. నాంచారిని తనతో పంపించాలని పట్టు పట్టాడు. నాన్నగారు గెటౌట్ అన్నారు. నాంచారిని కిడ్నాప్ చేసినట్టు నాన్నగారిపై కేసు పెడతానని, ఇంటిముందే ఆత్మహత్య చేసుకుంటానని, అర్ధరాత్రి పూట దొంగచాటుగా వచ్చి నాంచారిని చంపేస్తానని ఇంకేవేవో వాగాడు. చివరికి పోలీసులను కూడా తీసుకువచ్చాడు. నాన్నగారు వాళ్లకేదో చెప్పారు. చాలా గొడవైన తర్వాత పోలీసులు నాంచారి మామయ్యని లాక్కెళ్ళిపోయారు.

అర్ధరాత్రి భోజనాల దగ్గర నాన్నగారు అమ్మతో "వాళ్ళింత దుర్మార్గులనుకోలేదు,అమ్మాయిని అడ్డం పెట్టుకొని డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇటువంటి వాళ్ళని అస్సలు క్షమించకూడదు. నాంచారి మనకి మరో కూతురనుకుందాం. తమ్ముడితో మరోసారి మాట్లాడతాను" అన్నారు.

నాకానందానికి అవధుల్లేవు. అన్నింటికీ మించి వెళ్ళిపోతూ నాంచారి అన్న మాటలు నా మనసులో ముద్రపడి పోయాయి.

" నాకు జీవితాన్ని ప్రసాదించావు. ప్రతిరోజూ నిద్ర లేస్తూ నిన్నే తల్చుకుంటాను". కళ్ల నీళ్ళ పర్యంతమై మాటలు తడబడుతుంటే ఎక్కిళ్ళ మధ్య పెగల్చుకొని ఒక్కొక్క మాట అంటున్నప్పుడు నాంచారి ముఖంలో కన్పించిన అనిర్వచనీయమైన సంతోషాన్ని తలుచుకున్నకొద్దీ నేను నిలువెల్లా పులకించిపోతూవుంటా.

— మోతీలాస్య